# వైద్య విద్యార్థులు సమస్యలు ఉంటే తన దృష్టికి తీసుకుని రావాలి....

## మెనూ ప్రకారం విద్యార్థులకు భోజనం అందించాలి...

## వైద్య కళాశాల నిర్వహణపై ఎమ్మెల్యే సమీక్ష ఎమ్మెల్యే తూడి మేఘా రెడ్డి



**వనపర్తి ప్రతినిధి,జనవరి 9,ప్రభాతవార్త :** విద్యార్థులకు ఇబ్బంది లేకుండా వసతి గృహాలను ఉంచాలని ఏదైనా సమస్య ఉంటే తన దృష్టికి తీసుకురావాలని ఎమ్మెల్యే తూడి మేఘా రెడ్డి సూచించారు.మంగళవారం జిల్లా కేంద్రంలోని ఐద్య కళాశాల నిర్వహణ పై ఎమ్మెల్యే సమీక్ష సమావేశం నిర్వహించారు.ముందుగా ఎమ్మెల్యే కళాశాల ప్రిన్సిపల్ నునందిని తో పలు అంశాల పై సుదీర్ఘంగా చర్చించారు.ఈ సందర్బంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ...విద్యార్థులకు అందించే భోజన విషయంలో ప్రత్యేక దృష్టి సారించాలని కళాశాలలో ఏర్పాటు చేసిన మెనూ ప్రకారమే భోజనాలందించే విధంగా చర్యలు చేపట్టాలని ఆయన సూచించారు.ఈ సందర్బంగా ప్రిన్సిపల్ మాటాడుతూ కళాశాల నిర్మాణాలపై దృష్టి సారించి త్వరగా నిర్మాణాలు పూర్తయ్యే విధంగా చర్యలు తీసుకోవాలని ఆమె ఎమ్మెల్యేను కోరారు.అందుకు సానుకూలంగా స్పందించినా ఆయన కళాశాలలో అత్యవసరంగా అవసరం ఉన్న సమస్యలను గుర్తించి ఒక లెటర్ రూపంలో ఇవ్వాలని ఆయన సూచించారు.ఈ కార్యక్రమంలో డీఎంహెచ్ఓ జయచంద్ర మోహన్,అడిషనల్ డీఎంహెచ్ఓ సాయినాథ్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

మహబూబ్‌నగర్
వార్త
నాగర్‌కర్నూల్ / వనపర్తి / జోగులాంబ గద్వాల / నారాయణపేట

# భూముల ఆక్రమణలపై ఎంక్వైరీ చేయాలి..

## గత ప్రభుత్వంలో అప్పనంగా దోచేశారు

## ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్‌రెడ్డి

## రెవెన్యూశాఖ మంత్రిని కోరిన ఎమ్మెల్యే



మంత్రి పొంగులేటిని కలిసిన ఎమ్మెల్యే

**మహబూబ్‌నగర్‌బ్యూరో, జనవరి 09 ప్రభాతవార్త:** గత ప్రభుత్వం హయాంలో ఆక్రమణకు గురైన ప్రభుత్వ స్థలాలను భూములపై విచారణ జరిపించాలని మహబూబనగర్ ఎమ్మెల్యే శ్రీనివాస్‌రెడ్డి రెవెన్యూ శాఖ మంత్రిని కోరారు. రాష్ట్ర రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డిని సెక్రెటరీయేట్‌లో కలిసి జిల్లాలో గల భూ సమస్యలపై కొన్ని సంవత్సరాలుగా ప్రభుత్వ భూములు అన్యాక్రాంతం అయిన విషయంపై రెవెన్యూ మంత్రితో చర్చించారు. ప్రభుత్వ భూములను అప్పనంగా నాడు అధికారంలో ఉన్న నాయకులు అందరు కలిసి మూకుమ్మడిగా దోచుకున్నారని, వాటిని తిరిగి ప్రభుత్వం వెనక్కి తీసుకునే విధంగా చర్యలు తీసుకోవాలని ఆయన మంత్రి దృష్టికి తీసుకెళ్లారు. ఎక్కడ ప్రభుత్వ భూములు కల్పించిన వాటిని కబ్జా చేయడం జరిగిందని మహబూబ్‌నగర్‌లో ప్రభుత్వ భూమి అనేది కనిపించే పరిస్థితి నేడు లేకుండా చేశారని ఆయన మంత్రికి తెలిపారు. ప్రభుత్వ భూములు అన్యాక్రాంతంపై ఎంక్వైరీ చేయించి, పకడ్బందీగా తగు రీతిన చర్యలు తీసుకుని ప్రభుత్వ భూములను ఆక్రమించిన వారినుంచి భూములు రికవరీ అయ్యేలా చర్యలు తీసుకోవాలని, వారిపై తప్పకుండా చట్టరీత్యా చర్యలు తీసుకోవాలని ఆయన మంత్రికి తెలిపారు. అనంతరం మంత్రి సానుకూలంగా స్పందించి వీలైనంత త్వరలో ఎంక్వైరీ చేయించి ప్రభుత్వ భూములను రికవరీ అయ్యేలా చర్యలు తీసుకుంటానని హామీ ఇచ్చారు.

# ఆలయ అభివృద్ధికి కేంద్ర సహకారం..

## ఆశ కార్యకర్తలు అంగన్‌వాడి టీచర్ల జీతాలపై పున: సమీక్షిస్తాం



జోగులాంబ ఆలయ సన్నిధిలో కేంద్ర ఆరోగ్యశాఖ మంత్రి సత్యపాల్‌సింగ్ భగెల్

**గద్వాల ప్రతినిధి, జనవరి 09 ప్రభాతవార్త :** జోగుళాంబ ఆలయ అభివృద్ధికి కేంద్ర ప్రభుత్వ సహకారం ఉంటుందని అలాగే ఆశ కార్యకర్తలు, అంగన్‌వాడి టీచర్ల జీతాలపై ప్రభుత్వం పున: సమీక్షిస్తుందని కేంద్ర ఆరోగ్యశాఖ మంత్రి సత్యపాల్‌సింగ్ బగెల్ అన్నారు. మంగళవారం ఇటిక్యాల మండల పరిధిలోని బీచుపల్లి ఆంజనేయస్వామి ఆలయంలో ఆయన ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం శక్తి పీఠమైన అలంపూర్ జోగులాంబ బాల బ్రహ్మేశ్వర స్వామివారి ఆలయాలను మంగళవారం కేంద్ర ఆరోగ్యశాఖ మంత్రి సత్యపాల్‌సింగ్ బఘేల్ దర్శించుకున్నారు. ఈసందర్భంగా అడిషనల్ కలెక్టర్ అపూర్వ చౌహాన్, ఆర్డీఓ చంద్రకళ, ఆలయ ఈఓ పురేందర్‌కుమార్, ఛైర్మన్ చిన్నకృష్ణయ్య, ఆలయ ప్రధాన అర్చకులు ఆనంద్‌శర్మ, పూర్ణకుంభంతో ఘన స్వాగతం పలికారు. అనంతరం జోగుళాంబ బాల బ్రహ్మేశ్వర ఆలయాలను దర్శించి ప్రత్యేక పూజలు చేశారు. ప్రధాన అర్చకులు వారికి తీర్థ ప్రసాదాలు అందజేసి వేద ఆశీర్వచనం చేయగా ఆలయ ఈఓ పురందర్‌కుమార్, ఛైర్మన్ చిన్నకృష్ణయ్య నాయుడు శేషవస్త్రాలు అమ్మవారి జ్ఞాపికను అందజేశారు. పూజా కార్యక్రమం అనంతరం ఇక్కడి ప్రాంత వైశిష్ట్యాన్ని అడిషనల్ కలెక్టర్ కేంద్ర మంత్రికి వివరించారు. అనంతరం కేంద్ర మంత్రి మీడియాతో మాట్లాడుతూ ఇక్కడి ఆలయాలలో చేపట్టాల్సిన అభివృద్ధిపై దేవస్థానం వారు నివేదికను డిపిఆర్ రూపంలో అందజేస్తే సంబంధిత శాఖ మంత్రి కిషన్‌రెడ్డి ద్వారా ఇక్కడి ఆలయాల అభివృద్ధికి కేంద్ర సహకారాన్ని అందజేస్తామన్నారు. అలాగే తనకు అంగన్‌వాడి, ఆశా వర్కర్లు అంటే ఎనలేని గౌరవమన్నారు. ఆశ కార్యకర్తలు అత్యంత తక్కువ వేతనాన్ని పొందుతూ అత్యధిక సేవలను అందిస్తుంటారని కొనియాడారు. వారి సేవలను దృష్టిలో ఉంచుకుని వేతన పెంపునకు పునసమీక్షకు చొరవ చూపుతామన్నారు. కార్యక్రమంలో సిఐ రాజు, తహసిల్దార్ మంజుల, బిజెపి జిల్లా అధ్యక్షుడు రామచంద్రారెడ్డి, స్థానిక వైద్యబృందం ఉన్నారు.

## బాలికా విద్యకు ప్రోత్సాహం అందించి

# ఆడపిల్లలు చదివేలా కృషి చేయాలి:ఎమ్మెల్యే



కార్యక్రమంలో మాట్లాడుతున్న కలెక్టర్

**నారాయణపేట ప్రతినిధి, జనవరి 09 ప్రభాతవార్త :** నారాయణపేట సింగారంలోని స్కిల్ డెవలప్ మెంట్ సెంటర్‌లో స్త్రీ, శిశు వయోవృద్ధుల సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో మంగళవారం ఏర్పాటు చేసిన భేటీ బచావో భేటీ పడావోపై అవగాహన కార్యక్రమానికి జిల్లా కలెక్టర్ కోయ శ్రీహర్ష ముఖ్య అతిథిగాహాజరయ్యారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ బాలికా విద్యను ప్రోత్సాహించాలని అన్నారు. ఇందుకు ప్రతి గ్రామంలో అవేర్నెస్ ప్రోగ్రాం నిర్వహించాలన్నారు. ప్రతి బాలిక పాఠశాలలో చదివేలా చర్యలు తీసుకోవాలన్నారు. ప్రస్తుతం 250 మంది ఓపెన్ స్కూల్ ద్వారా చదవుతున్నందున ధన్యవాదాలు తెలిపారు. ఇంకా చదవాలని ఐటిఐ పాలిటెక్నిక్ లాంటి ఉన్నత చదువులు చదివి వారు స్థిరపడేలా కృషి చేయాలన్నారు. వారిని ఆర్థికంగా ఆదుకునేలా చర్యలు తీసుకుంటామన్నారు. రాష్ట్రంలో ఎక్కడలేని విధంగా నారాయణపేట జిల్లాలో బాలిక విద్యకు పెద్ద పీట వేసినట్లు తెలిపారు. డిడబ్ల్యుఓ వేణుగోపాల్ మాట్లాడుతూ బాల్య వివాహాలను పూర్తిగా అరికట్టినట్లు తెలిపారు. డ్రాపవుట్లు లేకుండా చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. డీఈఓ గని మాట్లాడుతూ జిల్లాలో డ్రాపవుట్లు తగ్గించినట్లు తెలిపారు. మొత్తంలో డ్రాపవుట్ అయిన విద్యార్థులకు మక్తల్ కేంద్రంలో ఓపెన్ స్కూల్ సెంటర్ ఏర్పాటు చేసేందుకు కృషి చేయడానికి చర్యలు తీసుకుంటామని తెలిపారు.



విద్యార్థులతో కలెక్టర్ కోయ శ్రీహర్ష

## ఇసుక అనుమతులు ఒక చోటుకు..

# తరలింపు మరోచోటుకు..!

## -రాత్రి పగలు తేడా లేకుండా అక్రమంగా తరలుతున్న ఇసుక

**వెల్దండ, జనవరి 09 ప్రభాతవార్త:**రాత్రి, పగలు తేడా లేకుండా ఇసుక బకాసురులు రోజు రోజుకు ఇసుకను తరలిస్తూ సొమ్ము చేసుకుంటున్నారు. వివరాల్లోకి వెళితే... ఉమ్మడి మండల పరిధిలోని చంద్రాయన్‌పల్లి, భైరాపూర్ వాగుల నుంచి గత కొన్ని రోజులుగా ఇసుకను ట్రాక్టర్ల ద్వారా ఇసుకను అక్రమంగా తోడేస్తున్నారు. ప్రభుత్వ భవనాల నిర్మాణాల పేరిట అనుమతులు పొంది మరోచోటుకు తరలిస్తూ సొమ్మును పోగు చేసుకుంటున్నారు. కంటోనిపల్లి నూతన గ్రామ పంచాయతీ భవనం పేరిట ఈ నెల 9,10వ తేదీల్లో తహసీల్దార్ కార్యాలయం నుంచి అనుమతులు పొంది మండల కేంద్రంలో డంప్ చేస్తున్నారు. రాత్రి వేళల్లో కూడా నిత్యం అక్రమంగా వాగులో నుంచి ఇసుకను తరలిస్తు న్నారని సమీప గ్రామస్తులు పేర్కొంటున్నారు. అక్రమ ఇసుక తరలింపును అధికారులు అడ్డుకోవాలని మండల ప్రజలు కోరుతున్నారు.



ఇసుక అనుమతులు తీసుకున్న కాపీ



మండల కేంద్రంలో ఇసుకను డంప్ చేస్తున్న దృశ్యం

# అభివృద్ధి అనేది నిరంతర ప్రక్రియ...

**రైతులకు నాణ్యమైన విద్యుత్ ను సరఫరా చేయాలి...**
**ఆయుస్మాన్ భారత్ పథకం పై అవగాహన కలిగించాలి...**
**విద్యార్థులకు నాణ్యమైన విద్యాబోధన చేసేందుకు చర్యలు చేపట్టాలి...**
**ఆరు గ్యారెంటీల పథకాలను అమలు**
**చేసేందుకు కృషి చేస్తాం....ఎమ్మెల్యే మేఘా రెడ్డి....**
**జిల్లాను ప్రగతి పథంలో నిలిపేందుకు అధికారులు.**
**ప్రజాప్రతినిధులు సమన్వయంతో పని చేయాలి..కలెక్టర్**
**నిధులు కేటాయించడంలోవ్యతాసం చూపుతున్నారని**
**నెల పై కూర్చుని జెడ్పి కో ఆప్షన్ సభ్యుడు ఉస్మాన్ నిరసన....**
**వేదిక పైన ఎమ్మెల్యే ఎలా కూర్చుటాండు... ఖిల్లా ఘనపురం జడ్పీటిసి సామ్య నాయక్...**



సమావేశంలో నేలపై కూర్చున్న నిరసనను వ్యక్తం చేస్తున్న జెడ్పి కో ఆప్షన్ సభ్యులు ఉస్మాన్

**వనపర్తి ప్రతినిధి,జనవరి 9,ప్రభాతవార్త :** అభివృద్ధి అనేది నిరంతర ప్రక్రియ అని వనపర్తి జడ్పీ చైర్ పర్సన్ లోక్ నాథ్ రెడ్డి అన్నారు. మంగళవారం జిల్లా ప్రజా పరిషత్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన సర్వసభ్య సమావేశంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని సమావేశానికి హాజరైనా సభ్యులనుద్దేశించి మాట్లాడారు.సర్వసభ్య సమావేశంలో జిల్లా గ్రామీణాభివృద్ధి సంస్థ అధికారులు భాషా,ప్రభాకర్ లతో చర్చ జరిగింది.జిల్లాలో వృద్యాప్య,వితంతు, దివ్యాంగులు,చేనేత,కల్లుగీతా,బీడీ కార్మికుల,ఒంటరి మహిళల,బోదకాల,డయాలసిన్ పింఛన్లు 75,410 మంది లబ్దిదారులు ఉన్నారని తెలిపారు.జిల్లాలో 14 మండల మహిళా సమాఖ్యలు,343 గ్రామ మహిళ సమాఖ్యలు,7,335 మహిళా స్వయం సహాయక బృందాలు ఉన్నాయని 85,949 స్త్రీ నిధి ద్వారా బుణం మంజూరు చేసి మహిళాభివృద్ధికి కృషి చేశామని తెలిపారు.విద్యా శాఖ పై చర్చ జరిగింది.కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో 708 పాఠశాలలు ఉన్నాయని తెలిపారు.369 ప్రాథమిక పాఠశాలల్లో 17634 విద్యార్థులు,136 ప్రాథమికొన్నత పాఠశాలలో 12222 మంది విద్యార్థులు 203 హై స్కూలులో 54225 మొత్తం 84081 మంది విద్యార్థులు విద్యను అభ్యసిస్తున్నారని తెలిపారు. 1 నుంచి 10 తరగతి లోపు 518 పాఠశాలలో మధ్యాహ్న భోజనం పథకం అమలవుతుందని చెప్పారు.పదవ తరగతి పరీక్షల తేదిలు ఖారారయ్యాని చెప్పారు.జడ్పీ చైర్ పర్సన్ లోక్ నాథ్ రెడ్డి మాట్లాడుతూ సీసీ కెమెరా లను ఏర్పాటు చేసి నిఘా పెంచడం జరిగిందని తెలిపారు.మన ఊరు మన బడి పథకం కింద 183 పాఠశాలలు ఎంపిక చేసి అన్ని సౌకర్యాలు కల్పించేందుకు చర్యలు తీసుకోవడం జరిగిందన్నారు.విద్యార్థులకు నాణ్యమైన విద్యా బోధన చేసేందుకు చర్యలు చేపట్టామని తెలిపారు.వైద్య ఆరోగ్య శాఖపై చర్చ జరిగింది.వైద్య మరియు ఆరోగ్య శాఖ పై మాట్లాడుతూ 14 ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు,104 ఆరోగ్య ఉప కేంద్రాలు,4 సామాజిక ఆరోగ్య కేంద్రాలు 2 పట్టణ ఆరోగ్య కేంద్రాలు ఒక జిల్లా ఆసుపత్రి ,2 బస్తీ దవాఖానలో ప్రజలకు మెరుగైన వైద్య సేవలను అందించాలని జిల్లా వైద్య ఆరోగ్య శాఖధికారి డాక్టర్ జయచందర్ కు ఆదేశాలు జారి చేశారు.ముఖ్యంగా ఆయుస్మాన్ భారత్ పథకం పై అవగాహన కలిగించి ప్రజలకు ఆయుస్మాన్ భారత్ కార్డులు ఇప్పించేందుకు కృషి చేయాలని చెప్పారు. విద్యుత్‌శాఖపై చర్చ జరుగగా వినియోగదారులకు,రైతులకు నాణ్యమైన విద్యుత్‌ను సరఫరా చేయాలని విద్యుత్ శాఖ ఈఈకి వివరించారు.అటవీశాఖ ఆధ్వర్యంలో 9వ విడత హరితహారంలో భాగంగా వనపర్తి జిల్లాలకు 21.912 లక్షల మొక్కలు నాటే లక్ష్యంగా పెట్టుకుని 17.07 లక్షళ మొక్కలు నాటడం జరిగిందని అటవీశాఖ డిప్యూటీ రేంజ్ ఆఫీసన్ వాణీ తెలిపారు.పశు సంవర్ధక శాఖ అధికారి మధుసూదన్ మాట్లాడుతూ 75 వేల గోజాతి పశువులు, 72 వేల గేదేజాతి,9 లక్షల 76 వేల గొర్రెలు,80 వేల మేకలు 20 వేల నాటు కోళ్ళు, 7 లక్షల 59 లక్షల ఫారం కోళ్ళు పను సంపదగా ఉందని తెలిపారు.జడ్పీ చైర్ పర్సన్ లోక్ నాథ్ రెడ్డి మాట్లాడుతూ జిల్లాలో పశు సంపదను పెంచేందుకు చర్యలు తీసుకోవాలని చెప్పారు.రాజీవ్ విద్యా దివేన పథకం కింద 9వ,10వ తరగతి విద్యార్థులకు వర్తింపజేయాలని చెప్పారు.పోస్ట్ మెట్రిక్ ఉపకార వేతనాలు అందజేయాలని చెప్పారు. విదేశాలలో చదువకునే గిరిజన విద్యార్థులకు అంబేద్కర్ ఓవర్ సిస్ విద్యా నిధి పథకం ద్వారా ఉపకార వేతనాలు చెల్లించే ఏర్పాట్లు చేయాలని తెలిపారు.గిరిజనులకు ఉచిత విద్యుత్,కులాంతర వివాహము, పోడు భూముల,ఎకనామిక్ సపోర్ట్ స్కీమ్ వంటి పథకాలలో భాగస్వాములను చేయడం జరుగుతుందని జిల్లా గిరిజన సంక్షేమ శాఖ డిటీడీ ఓ శ్రీనివాస్ తెలిపారు.రాజీవ్ భీమా లిఫ్ట్,మహాత్మాగాంధీ లిఫ్ట్,జూరాల ప్రాజెక్టు ఎడమ కాల్వల ద్వారా జిల్లాలో 436 చెరువులను నింపడం జరిగిందని నీటిపారుదల శాఖ ఎస్ఈ సత్యశీలారెడ్డి వివరించారు.వెనుక బడిన అభివృద్ధి,మైనార్టీ సంక్షేమ శాఖల అధికారి బీరం సుబ్బారెడ్డితో చైర్మన్ మాట్లా డారు.ఆయా శాఖలలో ప్రగతిని సాధించాలని చెప్పారు.



మాట్లాడుతున్న జెడ్పి చైర్మన్ లోకనాథ్ రెడ్డి

**ఆరు గ్యారెంటీల పథకాలను అమలు చేసేందుకు కృషి చేస్తాం... ఎమ్మెల్యే మేఘారెడ్డి**

ఎమ్మెల్యే తూడి మేఘా రెడ్డి పాల్గొని ప్రసంగించారు.రాష్ట్ర ముఖ్య మంత్రి రేవంత్ రెడ్డి ప్రవేశపెట్టిన ఆరు గ్యారెంటీల పథకాలను అమలు చేసేందుకు కృషి చేస్తామని తెలిపారు.ప్రజల కోరిక మేరకు ప్రజా సేవలో పలు అభివృద్ధి పనులు చేస్తామని తెలిపారు.

**జిల్లాను ప్రగతి పథంలో నిలిపేందుకు అధికారులు,ప్రజాప్రతినిధులు సమన్వయంతో పని చేయాలి...కలెక్టర్**

జిల్లా కలెక్టర్ తేజస్ నందలాల్ పవార్ మాట్లాడుతూ జిల్లాను ప్రగతి పథంలో నిలిపేందుకు అధికారులు.ప్రజాప్రతినిధులు సమన్వయంతో పని చేయావలసి ఉంటుందని తెలిపారు.ప్రభుత్వ శాఖలలో నెలకొన్న సమస్యలను ఎప్పటికప్పుడు పరిష్కరించేందుకు చర్యలు తీసుకుంటామని చెప్పారు.కేంద్ర,రాష్ట్ర ప్రభుత్వాల పథకాలను అమలు చేసేందుకు కృషి చేయాలని అధికారులకు ఆదేశాల జారి చేశారు.



సమావేశంలో నేలపై కూర్చున్న నిరసనను వ్యక్తం చేస్తున్న జెడ్పి కో ఆప్షన్ సభ్యులు ఉస్మాన్

**నిధులు కేటాయించడంలోవ్యతాసం చూపుతున్నారని నెల పై కూర్చుని నిరసన.... జెడ్పి కో ఆప్షన్స్ భ్యుడు ఉస్మాన్**



మాట్లాడుతున్న కలెక్టర్ తేజస్ నంద లాల్ పవార్

అభివృద్ధి పనుల కోసం నిధులు కేటాయించడం పట్ల అందరికి పెట్టి తన పట్ల ఎందుకు వ్యతాసం చూపుతున్నారని ఇప్పటికే పలు మార్లు చెప్పిన ఎందుకు పట్టించుకోవడం లేదని జెడ్పి కో ఆప్షన్స భ్యులు ఉస్మాన్ ఆవేదనను వ్యక్తం చేస్తూ జిల్లా పరిషత్ సర్వ సభ్య సమా వేశంలో నేల పై కూర్చుని నిరసనను వ్యక్తం చేసారు.జెడ్పి నిధులు కో ఆప్షన్స భ్యులు అందరికి పెట్టి నాకు మాత్రం పెట్టడం లేదు. మద నాపురం మండలం గోపన పేట గ్రామంలో సిసి రోడ్డు,డ్రైనేజి రూ.8 లక్షలు పెట్టాలని గత 8 నెలల నుండి కోరగా ఇప్పుడు వరకు పెట్ట డం లేదని ఆవేదనను వ్యక్తం చేరారు.జెడ్పి చైర్మన్ వ్యక్తిగతంగా తీసుకుని ఇలా చేస్తున్నారని అందరి లాగానే అభివృద్ధి కోసం తనకు సైతం సహకరించాలని ఆయన తెలిపారు.

**వేదిక పైన ఎమ్మెల్యే ఎలా కూర్చుటాండు...**
**ఖిల్లా ఘనపురం జడ్పీటిసి సామ్య నాయక్....**

ఎమ్మెల్యే మేఘారెడ్డి మొదటి సారి జిల్లా పరిషత్ సర్వ సభ్య సమావేశంకు హాజరయ్యారు.దాదాపు 20 నిముషాలు ఉండి తనకు ఇతర పనులు ఉన్నాయని చెప్పి వెళ్ళిపోయాడు.తరువాత ఖిల్లా ఘనపురం జడ్పీటిసి సామ్య నాయక్ మాట్లాడుతూ జిల్లా పరిషత్ సర్వ సభ్య సమావేశంలో ఎమ్మెల్యే కోసం ఏర్పాటు చేసిన స్థానంలో కాకుండా ఎమ్మెల్యే మేఘా రెడ్డి నేరుగా వేదిక పైన ఎలా కూర్చుటాండు అని ప్రశ్నను ఆయన లేవనెత్తాడు..ప్రస్తుత ఎమ్మెల్యే గతంలో ఎంపీపీ ఉన్న సమయంలో జిల్లా పరిషత్ సర్వ సభ్య సమావేశంకు వచ్చిన గత ఎమ్మెల్యేలు ఎవరు వేదిక పైకి వెళ్లలేదని తను ఎంపిపి గా ఉన్నప్పుడు చూసారని తెలుసునని ఇప్పుడు ఎమ్మెల్యే అయితే ఎలా వేదిక పైకి వెళ్లి కూర్చుటాండని ప్రశ్నించగా జెడ్పి చైర్మన్ లోకనాథ్ రెడ్డి మాట్లాడుతూ మొదటి సారి వచ్చారు అందుకే చెప్పలేదని తరువాత సమావేశంలో ఎమ్మెల్యే కోసం ఏర్పాటు చేసిన స్థానంలో కూర్చుటాండని తెలిపారు.ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్ లోకల్ బాడీస్ సంచిత్ గంగ్వార్,జిల్లా పరిషత్ వైస్ చైర్మన్ వామన్ గౌడ్,జడ్పీటీసిలు రాజేంద్రప్రసాద్ యాదవ్,కృష్ణయ్య,లక్ష్మీ,పద్మ, భార్గవి,మాధురి,సరోజ,సోమేశ్వరమ్మ,వెంకట్రామమ్మ,యంపీపీలు కృష్ణా నాయక్,గాయత్రి పృథ్వీరాజ్,జే.పద్మావతి,కిచ్చారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# పథకాల అమలులో జాప్యం ఉండదు..!

**డబుల్ బెడ్‌రూం ఇండ్లపై దృష్టి సారించాలి**
**ప్రభుత్వ భూములను పరిరక్షించాలి**
**మహబూబ్‌నగర్ కలెక్టర్ జి. రవినాయక్**
**వివిధ పథకాల అమలుపై సమీక్ష**



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ రవినాయక్



సమావేశానికి హాజరైన అధికారులు

**మహబూబ్‌నగర్ బ్యూరో, జనవరి 09 ప్రభాతవార్త :** ప్రభుత్వ ప్రాధామ్య పథకాల అమలులో జాప్యం లేకుండా చూడాలని జిల్లా కలెక్టర్ జి, రవినాయక్ జిల్లా అధికారులను ఆదేశించారు. మంగళవారం సమీకృత జిల్లా అధికారుల కార్యాలయ భవన సముదాయంలోని సమావేశ మందిరంలో నిర్వహించిన జిల్లా అధికారుల సమ్మిళిత సమావేశంలో పలు అంశాలపై ఆయన సమీక్ష నిర్వహించారు. భూమి కొనుగోలు పథకం కింద షెడ్యూల్ కులాల వారికి ప్రభుత్వం ద్వారా 2013 నుండి ఇప్పటివరకు కొని ఇచ్చిన భూములు, ప్రస్తుతం వాటి పరిస్థితిపై నివేదిక సమర్పించాలని షెడ్యూల్ కులాల కార్పొరేషన్ ఈడిని ఆదేశించారు. డబుల్ బెడ్‌రూం ఇండ్లలో లబ్దిదారులు ఇళ్లల్లో చేరనివి గుర్తించి తక్షణమే తాళాలు వేసి స్వాధీనంలో ఉంచుకోవాలని గృహ నిర్మాణశాఖ అధికారిని ఆదేశించారు. ప్రత్యేకించి పట్టణ ప్రాంతంలో డబుల్ బెడ్ రూమ్ ఇండ్లపై ఎక్కువ దృష్టి కేంద్రీకరించాలని అన్నారు. ఆసరా పెన్షన్ల కింద జీవిత భాగస్వామి చనిపోయిన కేసులకు మంజూరు చేసే పెన్షన్‌పై ప్రత్యేక దృష్టి కేంద్రీకరించి త్వరితగతిన మంజూరు చేయాలని ఆదేశించారు. ధాన్యం కొనుగోలులో భాగంగా నిర్దేశించిన మేరకు ధాన్యం కొనుగోలు చేసినప్పటికి ప్రభుత్వం ద్వారా కాకుండా మార్కెట్లో రైతులు అమ్మిన ధాన్యం వివరాలు పూర్తిగా డేటా సేకరించి ఉంచుకోవాలని పౌర సరఫరాల శాఖ అధికారులను ఆదేశించారు. ప్రభుత్వ భూములు, చెరువుల శిఖం భూములు, లోతట్టు ప్రాంతాలలో నిర్మాణాలు జరిపి ఉన్నట్లయితే వాటికి నో అబ్జెక్షన్ సర్టిఫికెట్ ఇచ్చిన తర్వాత నిర్మించున్నవి? ఎలాంటి అనుమతులు లేకుండా నిర్మించిన వాటి వివరాలను విడి విడిగా రూపొందించాలని అధికారులను ఆదేశించారు. ప్రభుత్వ భూములన్నింటిని ఆయా శాఖల అధికారులు పరిరక్షించుకోవాల్సిన అవసరం ఉందని ఆయన తెలిపారు. గ్రామ పంచాయతీ భవనాల నిర్మాణంలో భాగంగా పురోగతిలో ఉన్న భవనాలను త్వరితగతిన పూర్తి చేయాలని పంచాయతీరాజ్ ఇంజనీర్ ఆదేశించారు. జిల్లాలో అన్ని ఆసుపత్రులలో ఓపి కనీసం 100కు తగ్గకుండా చూడాలని,కోవిడ్ కేసులపై దృష్టిసారించాలని జిల్లా వైద్యారోగ్యశాఖ అధికారిని ఆదేశించారు. కాలుష్య నియంత్రణలో భాగంగా పోలేపల్లి సెజ్‌లో పరిశ్రమలను జిల్లా అధికారుల బృందం వెళ్లి తనిఖీ చేసి నివేదిక సమర్పించాలని చెప్పారు. ప్రతినెల 7,8 తేదీలలో గ్రామ పంచాయతీల విద్యుత్ బిల్లులను జనరేట్ చేసి ఇవ్వాలని విద్యుత్ శాఖ అధికారులను ఆదేశించారు. ఈ ఆఫీస్‌లో ఉన్న ఫైళ్లను ఎప్పటికప్పుడు పరిష్కరించాలని అన్నారు. సీఎం ప్రజావాణిలో సమర్పించిన ఫిర్యాదులకు అధికారులు జాగ్రత్తగా సమాధానాలు ఇవ్వడమే కాకుండా, వాటిని త్వరగా పరిష్కరించాలని చెప్పారు. ప్రజాపాలన దరఖాస్తుల డేటా నమోదు వేగవంతం చేయాలని, రేషన్ కార్డుల నంబర్లు లేకుండా దరఖాస్తు చేసిన వాటిపై కారణాలను విశ్లేషించాలని అన్నారు. ప్రధానమంత్రి ఎక్సలెంట్ అవార్డులకు సంబంధించి కేంద్ర ప్రభుత్వం ద్వారా అమలు చేస్తున్న 12 రంగాలలో అవార్డులు వచ్చేందుకు అవకాశం ఉన్నందున ఆ కార్యక్రమాలు అమలు చేసే జిల్లా అధికారులు బాగా పనిచేసే అవార్డులు పొందేందుకు కృషి చేయాలని అన్నారు. అంతకుముందు జిల్లా కలెక్టర్ చెంచుల జీవన ప్రమాణాల మెరుగుకై కేంద్ర ప్రభుత్వం ద్వారా అమలు చేస్తున్న ప్రధానమంత్రి జన జాతీయ ఆదివాసి నయాభియాన్ పథకంపై మాట్లాడుతూ ఈ పథకం కింద తెలంగాలో మొదటి విడతన 5 రెండోవిడతన మరో 5 జిల్లాలు ఎంపిక అయ్యాయని, ఈ పథకం కింద చెంచుల జీవన ప్రమాణాలు మెరుగు పరిచేందుకు వివిధ పథకాల కింద సంక్షేమ కార్యక్రమాలు అమలు చేయడం జరుగుతుందని, ముఖ్యంగా వారికి ఉచిత నిత్యావసర సరుకుల పంపిణీ, ఎల్పీజి కనెక్షన్లు, ఆయుష్మాన్ భారత్, పౌష్టికాహారం, మధ్యాహ్న భోజనం,సుక్య సమృద్ధి యోజన, ప్రధాన మంత్రి జన్‌ధన్ భీమా, విద్య, వైద్యం, ఆరోగ్యం, విద్యుత్, కౌశల్ యోజన, జీవనోపాదుల వంటి పథకాలను అమలు చేస్తారని తెలిపారు. ఇందుకుగాను మహబూబ్‌నగర్ జిల్లాలో 5 మండలాలో 16 గ్రామాలలో ఈ కార్యక్రమాన్ని అమలు చేయనున్నట్లు ఆయన వెల్లడించారు. 464 చెంచు కుటుంబాలకు సంబంధించి లాభం కలిగే ఈ పథకం కింద ముందుగా ఈనెల 20లోగా పై పథకాల కింద వారికి కార్డులు ఉన్నది లేనిది సర్వే చేసి నివేదిక సమర్పించాలని ఆదేశించారు. గుర్తించిన చెంచులకు ఆధార్, కులము, జన్‌ధన్ భీమా యోజన, కిసాన్, కిసాన్ క్రెడిట్ కార్డు వంటివి ఉన్నాయో లేదో వివరాలను సేకరించాలని, వారికి ఎలాంటి సౌకర్యాలు కావాలో విశ్లేషించాలని, అదేవిధంగా ఆయా గ్రామాలలో తాగునీరు, విద్యుత్, ఆరోగ్యానికి సంబంధించి ఉన్న సౌకర్యాలను, పిల్లలు పాఠశాలల్లో చదువుతున్నది లేనిది పరిశీలిస్తూ అన్ని రకాల లబ్ధి వారికి చేకూర్చే విధంగా చూడాలని చెప్పారు. స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ శివేంద్ర ప్రతాప్, రెవెన్యూ అదనపు కలెక్టర్ ఎస్. మోహన్‌రావు, జిల్లా అధికారులు సమావేశానికి హాజరయ్యారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ ప్రధానమంత్రి జన జాతీయ ఆదివాసి నయా అభియాన్ పథకం కార్డులను ఆవిష్కరించారు.

# మాపై కోపంతో అభివృద్ధిని ఆపుతారా..

- పాలమూరును పదేండ్లలో ఎంతో డెవలప్ చేశాం..
- మీడియా సమావేశంలో మాజీ మంత్రి శ్రీనివాస్‌గౌడ్




మీడియా సమావేశంలో మాట్లాడుతున్న మాజీ మంత్రి వీ శ్రీనివాస్‌గౌడ్

**మహబూబ్‌నగర్ బ్యూరో, జనవరి 09 ప్రభాతవార్త :** మహబూబ్‌నగర్ జిల్లా అంటే ఒకప్పుడు వలసలకు కంపతారు చెట్లకు సాగుతాగునీరు లేక గోస పడ్డదని, తెలంగాణ ఆవిర్భవించాకయ కేసీఆర్ ప్రభుత్వ హయాంలో అనేక రకాల అభివృద్ధి పనులు చేసి చూపించామని మాజీ మంత్రి వీ శ్రీనివాస్‌గౌడ్ అన్నారు. మహబూబ్‌నగర్ జిల్లా కేంద్రంలోని ఎమ్మెల్సీ కవితతో కలిసి ఏర్పాటు చేసిన బీఆర్ఎస్ పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు. ఎన్నికలయ్యాక తమ మీద కోపంతో జిల్లా కేంద్రంలో జరుగుతున్న అభివృద్ధిని అడ్డుకోవడం ఎంతవరకు సమంజసమన్నారు. తాము ఆరోజే చెప్పారని అధికారం కావాలంటే ఎంపీటీసీలు కౌన్సిలర్లను అప్పజెబుతామని ఏమైనా చేసుకోండి కానీ అభివృద్ధిని మాత్రం ఆపొద్దని సూచించామన్నారు. కానీ ఈరోజు తమమీద కోపంతో పేదలకు ఉపయోగపడడే అనేక కార్యక్రమాలను ఆపేశారని ఆవేదన వ్యక్తం చేశారు. మహబూబ్‌నగర్‌లో ఎంతో ప్రతిష్టాత్మకంగా చేపడుతున్న దవాఖాన నిర్మాణం ఆగిపోతుందన్నారు. మహబూబ్‌నగర్ మున్సిపాలిటీలో టెండర్లు పూర్తయిన పనులను కూడా నిలిపివేయడం సరికాదన్నారు. మన్యంకొండలో పేదలు కల్యాణం జరుపకోవడానికి నిర్మిస్తున్న మండపాలు కూడా ఆపేయడం ఏంటని ప్రశ్నించారు. తెలంగాణలో తొలి రోప్ వేను మన్యంకొండలో నిర్మిస్తున్నామని, కానీ ఆ పనులు కూడాఆగిపోయాయన్నారు.ఇవీన్న పూర్తయితే రాష్ట్రంలో పెద్ద దేవాలయాల్లో మన్యంకొండ చేరేదన్నారు. తాము ఆరోజే చెప్పామని ఎట్టి పరిస్థితిలోనూ అభివృద్ధి ఆగొద్దని విజ్ఞప్తి చేశామన్నారు. మీడియా సమావేశంలో ఎంపి మన్నె శ్రీనివాస్‌రెడ్డి, మున్సిపల్ చైర్మన్ కేసీ నర్సింహులు, తదితరులు పాల్గొన్నారు.

# జిల్లా వ్యవసాయ అధికారిపై చర్యలు తీసుకోండి..

## కలెక్టర్‌కు ఫిర్యాదు చేసిన ఏఈఓలు

**నారాయణపేట ప్రతినిధి, జనవరి 09 ప్రభాతవార్త :** జిల్లా వ్యవసాయ అధికారి గురించి కలెక్టర్‌కు వ్యవసాయ విస్తరణ అధికారులు ఫిర్యాదు చేశారు. జిల్లాలోని వ్యవసాయ విస్తరణ అధికారులకు శాఖా పరమైన సమస్యల గురించి జిల్లా వ్యవసాయ అధికారి కిందిస్థాయి అధికారులపై ప్రదర్శిస్తున్న తీరును నిరసిస్తూ జిల్లా కలెక్టర్‌కు విన్నవించారు. వ్యవసాయ – మిగతా2లో..

## కల్వర్టు ప్రహరీగోడ ఎత్తు పనులు ప్రారంభం




ఉప్పునుంతల, గట్టుకాడిపల్లి మార్గంలో ప్రారంభించిన కల్వర్టు ప్రహరీ గోడ పనులు

**ఉప్పునుంతల, జనవరి 09 ప్రభాతవార్త:** పేరుకే డబుల్ రోడ్డు కనిపించని కల్వర్టు, వేగంగా వెళ్లిన వారికి తప్పని ప్రమాదం అనే శీర్షిక వార్తా దినపత్రిక లో మంగళవారం వెలువడింది. దీంతో స్పందించిన ఆర్‌అండ్‌బి శాఖ అధికారులు స్పందించి కల్వర్టు ప్రహరీ ఎత్తు పెంచే పనులకు శ్రీకారం చుట్టారు. దీంతో ఆ ప్రాంతం గుండా వెళ్లే వాహనచోదకులు ప్రజలు ఊపిరి పీల్చుకున్నారు.

## విజ్ఞాన వంతులుగా తీర్చిదిద్దేందుకు జీవశాస్త్ర కాంప్లెక్స్‌లు ఎంతో దోహదపడతాయి

**- జిల్లా అకాడెమిక్ మానిటరింగ్ ఆఫీసర్ దుంకుడు శ్రీనివాస్**



జీవశాస్త్ర కాంప్లెక్స్ సమావేశంలో మాట్లాడుతున్న ఎంఎంఓ దుంకుడు శ్రీనివాస్

**భూత్పూర్, జనవరి 9, ప్రభాతవార్త:** విద్యార్థుల్ని శాస్త్ర విజ్ఞానంలో అభిరుచిని పెంపొందించేందుకు, వారిని విజ్ఞాన వంతులుగా తీర్చిదిద్దేందుకు జీవశాస్త్ర కాంప్లెక్స్‌లు ఎంతో దోహదపడతాయని జిల్లా అకాడెమిక్ మానిటరింగ్ ఆఫీసర్ దుంకుడు శ్రీనివాస్ స్పష్టం చేశారు. భూత్పూర్ జెడ్పీహెచ్ఎస్‌లో నిర్వహిస్తున్న సైన్స్ కాంప్లెక్స్, జీవశాస్త్ర కాంప్లెక్స్ సమావేశానికి దుంకుడు ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థుల్ని ఉత్తమోత్తములుగా తీర్చిదిద్దేందుకు ఇటువంటి కాంప్లెక్స్‌లు నిర్వహించాల్సిన అవసరమెంతైనా ఉందని అభిప్రాయం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో స్కూల్ కాంప్లెక్స్ హెచ్ఎం ఆనందమ, డీఎస్ఓ శ్రీనివాస్, సీఆర్‌పీ ఠాగూర్ తదితరులు పాల్గొన్నారు.

**ఉర్దూ మీడియం పాఠశాల పనితీరుపై ఎంఎంఓ ఆగ్రహం..**

భూత్పూర్ పట్టణ కేంద్రంలోని పదోవార్డులో ఉన్న ఉర్దూ మీడియం పాఠశాలలో విద్యార్థుల హాజరుశాతంపై ఎంఎంఓ దుంకుడు శ్రీనివాస్ అసహనంతో ఆగ్రహం వ్యక్తం చేశారు. పాఠశాలలో మొత్తం 43మంది విద్యార్థులకుగాను కేవలం 13మంది విద్యార్థులు మాత్రమే హాజరుకావడంపై ఆయన అసహనం వ్యక్తం చేశారు. ఉపాధ్యాయులు, హెచ్ఎం తగిన శ్రద్ధ వహించడం లేదని ఆగ్రహం వ్యక్తం చేశారు.

## మహిమూద్ తల్లి మృతిపట్ల మాజీ ఎమ్మెల్యే ఆల సంతాపం



**భూత్పూర్, జనవరి9, ప్రభాతవార్త:** బీఆర్ఎస్ మైనార్టీ నాయకుడు అమిస్తాపూర్‌కు చెందిన మహిమూద్ తల్లి మహబూబ్‌బీ మంగళవారం మృతి చెందగా విషయం తెల్సుకున్న మాజీ ఎమ్మెల్యే ఆల వెంకటేశ్వర్‌రెడ్డి అమిస్తాపూర్‌కు చేరుకుని మహిబూబ్‌బీ మృతదేహం వద్ద శ్రద్ధాంజలి ఘటించి తన తీవ్ర సంతాపం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ సత్తూర్ బస్వరాజ్‌గౌడ్, ఎంపిపి కదిరే శేఖర్‌రెడ్డి, ముడా డైరెక్టర్లు సత్తూర్ చంద్రశేఖర్‌గౌడ్, మూస సాయిలుతో పాటు నాయకులు సత్తూర్ నారాయణగౌడ్, మేకల సత్యనారాయణ, తూము శ్రీనివాస్‌రెడ్డి, ఆగిరి రవి, రమేష్‌చందర్, ఫారూఖ్ హుస్సేన్(బీజేపీ) తదితరులు పాల్గొన్నారు.

## ఆలయాలను దర్శించుకున్న జిల్లా కలెక్టర్ కుటుంబ సభ్యులు



**గద్వాల ప్రతినిధి, జనవరి 09 ప్రభాతవార్త:** అష్టాదశ శక్తి పీఠాలలో ఐదవ శక్తి పీఠమైన శ్రీ జోగులాంబ గద్వాల జిల్లా నూతన కలెక్టర్‌గా బాధ్యతలు చేపట్టిన జిల్లా కలెక్టర్ బిఎం సంతోష్ మంగళవారం సాయంత్రం కుటుంబ సమేతంగా ఆలయాలలో ప్రత్యేక పూజలు చేశారు. అంతకు ముందు వీరికి ఆలయ ఏఓ పురెందర్‌కుమార్ ఆలయ ప్రధాన అర్చకుడు ఆనంద్‌శర్మ పూర్ణకుంభంతో స్వాగతం పలికారు. స్వామివారి అమ్మవారి ఆలయంలో రాత్రి మహా మంగళహారతిలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆలయాల విశిష్టతల గురించి ఆలయ అర్చకులు వారికి వివరించారు. వీరివెంట మండల తహసిల్దార్ మంజుల, ఆర్ఐ శ్రీవాణి తదితరులు ఉన్నారు.

## వేడినీళ్లు ఒంటిమీద పడి బాలిక మృతి



మృతి చెందిన బాలిక ధను శ్రీ (ఫైల్)

**నారాయణపేట ప్రతినిధి, జనవరి 09 ప్రభాతవార్త :** వేడినీళ్లు ఒంటిమీద పడి ధనుశ్రీ ఏడేళ్ల బాలిక మృతి చెందిన సంఘటన మక్తల్ పోలీస్ స్టేషన్ పరిధిలోని దాసరిపల్లి గ్రామంలో చోటు చేసుకుంది. సంఘటన జర్గాని మక్తల్ ఆసుపత్రికి తీసుకురాగా సరైన సమయంలో ట్రీట్మెంట్ చేయకపోవడం వల్లనే బాలిక మృతి చెందిందని తల్లిదండ్రులు బంధువులు అంటున్నారు. చివరి క్షణాల్లో మెరుగైన చికిత్సగా హైదరాబాద్‌కు తీసుకెళ్లండి అని చెప్పడంతో వెళ్తుండగా మార్గ మధ్యలో మృతి చెందిందని తల్లిదండ్రులు, బంధువులు బోరున విలపిస్తున్నారు. కాగా వాటి వివరాలు ఇలా ఉన్నాయి. మక్తల్ మండలం దాసరిపల్లి గ్రామానికి చెందిన బాబు, కవిత కూతురైన ధనుశ్రీ గత కొన్ని సంవత్సరాల కిందట బతుకు దెరువు కోసం మహారాష్ట్రలో పూన పట్టణంలో నివసిస్తుండగా స్వగ్రామంలో సోమవారం జరిగే ఉర్సు ఉత్సవాల్లో పాల్గొనేందుకు స్వగ్రామానికి రాగా అలవాటు ప్రకారం వేడినీళ్లతో స్నానం చేయడానికి అని స్టవ్‌పై ఉంచిన బకెట్‌ను తీసుకుంటుండగా జారి ఒంటిమీద పడగా తీవ్ర గాయాలయ్యాయి. దీంతో మక్తల్ ఆసుపత్రికి చికిత్స కోసం తీసుకురాగా ఉదయం నుండి సాయంత్రం వరకు మక్తల్ ఆసుపత్రిలో చికిత్స చేసిన చివరి క్షణాల్లో మెరుగైన వైద్యంకై హైదరాబాద్‌కు తీసుకెళ్లండని డాక్టర్ బాలిక తల్లిదండ్రులతో చెప్పడంతో అంబులెన్స్‌లో తీసుకెళ్తుండగా మార్గ మధ్యలో చనిపోవడం జరిగింది. ప్రమాదం జరిగిన వెంటనే మెరుగైన చికిత్స కోసం హైదరాబాద్‌కు రెఫర్ చేసి ఉంటే తమ బిడ్డ బతికుండేదని దీనికి మక్తల్ సివిల్ ఆసుపత్రి డాక్టర్ల నిర్లక్ష్యమే కారణమని తల్లిదండ్రులు, బంధువులు ఆరోపిస్తున్నారు.

# సాంస్కృతి సంప్రదాయాలను కాపాడుకుందాం!

**- డీఎస్పీ పార్థసారథిగౌడ్**



విజేతలకు బహుమతులు ప్రధానం చేస్తున్న డీఎస్పీ

**కల్వకుర్తి, జనవరి9 ప్రభాతవార్త:** సమాజంలో సాంస్కృతి సంప్రదాయాలను కాపాడుకోవాల్సిన బాధ్యత మనందరిపై ఉందని కల్వకుర్తి డీఎస్పీ పార్థసారథి అన్నారు. మంగళవారం కల్వకుర్తి పట్టణంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాల ఆవరణలో లయన్స్‌క్లబ్ కల్వకుర్తి మీ యాడ్స్ సంయుక్త ఆధ్వర్యంలో ముగ్గుల పోటీలను నిర్వహించారు. సంక్రాంతి పర్వదినాన్ని పురస్కరించుకొని ఈ పోటీలను ఏర్పాటు చేశారు. ఈ పోటీలకు ముఖ్య అతిథులుగా హాజరైన డీఎస్పీ మాట్లాడుతూ సామాజిక సేవా కార్యక్రమాలతో పాటు సాంస్కృతి సంప్రదాయాలకు పెద్దపీట వేసే పోటీలను నిర్వహించడం అభినందనీయమన్నారు. పోటీల్లో పాల్గొనే మహిళలు గెలుపోటములను సమానంగా స్వీకరించాలని లయన్స్‌క్లబ్ మాజీ గవర్నర్ జూలూరి రమేష్‌బాబు అన్నారు. లయన్స్‌క్లబ్ కల్వకుర్తి విస్తృతంగా సామాజిక సేవా కార్యక్రమాలు చేపట్టడంతో అభినందించారు. క్లబ్ చైర్మన్ కలిమిచెర్ల రమేష్ మాట్లాడుతూ సంక్రాంతి పర్వదినాలను పురస్కరించుకొని ముగ్గుల పోటీలు ఏర్పాటు చేసి విజేతలకు బహుమతులు అందించినట్లు తెలిపారు. పోటీల్లో మొదటి బహుమతి స్వాతి నాగమణి, ద్వితీయ బహుమతి జన్ని మౌనిక, తృతీయ బహుమతి అనిత ప్రియాంకలు గెలుచుకున్నారు. అయోధ్యలో భవ్య రామమందిరం ప్రారంభోత్సవాన్ని గుర్తు చేస్తూ ఒక యువతీ సీతారాముల ముగ్గు వేసింది. ఆ ముగ్గుకు క్లబ్ ఆర్గనైజింగ్ సెక్రటరి మిర్యాల శ్రీనివాస్‌రెడ్డి రూ.1000ల నగదు బహుమతిని అందించారు. కార్యక్రమంలో క్లబ్ కార్యదర్శి చిగుళ్లపల్లి శ్రీధర్, కోశాధికారి గోవిందశ్రీనివాస్, ఆర్గనైజింగ్ సెక్రటరి మిరియాల శ్రీనివాస్‌రెడ్డి, సభ్యులు రవిగౌడ్, కిషన్, గణేష్, వైద్యురాలు యశోదభాయి, కళాశాల ప్రిన్సిపాల్ సురేందర్‌రెడ్డి, సదానందంగౌడ్, మీ యాడ్స్ గౌరి, కలిమిచెర్ల స్రవంతి, గోవింద్ మౌనిక, కొండ శ్రీనిధి, పద్మ, రాణి, నిర్మల ఉన్నారు.



విజేతలతో కల్వకుర్తి లయన్స్‌క్లబ్ సభ్యులు

# ప్రజలకు శాంతియుత వాతావరణం నెలకొల్పడమే లక్ష్యం

**● ఎస్సై నరేష్ కుమార్**



పోలీసు కవాతు ఫ్లాగ్ మార్చ్ నిర్వహిస్తున్న దృశ్యం

**అయిజ, జనవరి 9 ప్రభాతవార్త:** శాంతి భద్రతల పరిరక్షణకు పోలీసులు నిత్యం ప్రజల వెన్నంటి ఉన్నారని నమ్మకం కల్పించడమే ఫ్లాగ్ మార్చ్ ప్రధాన లక్ష్యమని అయిజ ఎస్ఐ నరేష్ కుమార్ అన్నారు. మంగళవారం జిల్లా ఎస్పీ రితిరాజ్ ఐపిఎస్ ఆదేశాల మేరకు ఆర్‌ఏఎఫ్ డిప్యూటీ కమాండెంట్ ఎం.నరేష్ కుమార్ బృందంతో కలిసి అయిజ మున్సిపాలిటీలోని సొంత బజార్ ఎస్సీ కాలనీలో పోలీసులు కవాతు ఫ్లాగ్ మార్చ్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్సై నరేష్ కుమార్, మాట్లాడుతూ ప్రజలు ఎలాంటి సమస్యలు ఎదురైనా, శాంతి భద్రతలకు విఘాతం కలిగే పరిస్థితులు ఏర్పడినా నిర్భయంగా పోలీసులకు సమాచారం ఇవ్వాలని సూచించారు. పోలీసు వ్యవస్థ ప్రజలకు రక్షణ కల్పించడం, శాంతియుత వాతావరణం నెలకొల్పడమే లక్ష్యంగా నిరంతరం ప్రజలకు సేవలందిస్తున్నదని అన్నారు. ప్రజలకు రక్షణ కల్పిస్తూ ప్రాణాలను సైతం లెక్క చేయకుండా పనిచేసే పోలీసులకు ప్రజలు తమవంతు సహకారం అందించాలని కోరారు. సమస్యాత్మక ప్రాంతాలలో ప్రజలకు అవగాహన కల్పించడంతో పాటు పోలీసులు నిరంతరం వారి వెన్నంటి ఉంటారన్న భరోసా కల్పించడం లక్ష్యంగా పోలీసులు పని చేస్తున్నారని చెప్పారు. పోలీసు శాఖ ప్రజలకు నిరంతరం వెన్నంటి ఉన్నామని చెప్పడం, వారికి పోలీసు వ్యవస్థ పై మరింత నమ్మకం కల్పించడానికే కవాతు నిర్వహించినట్లు తెలిపారు. అయిజలోనే పాతబస్టాండు నుండి పాత పోలీసు స్టేషన్ గాంధీ చౌక్ మీదుగాకొత్త బస్టాండ్ పెట్రోల్‌పంప్ చౌరస్తా నుండి పోలీసు స్టేషన్ వరకు ర్యాలీగానిర్వహించారు. ఫ్లాగ్ మార్చ్‌లో ఆర్‌ఏఎఫ్ అసిస్టెంట్ కమాండెంట్ కాంబ్లేవినాయకకాశినాథ్, అయిజ ఎస్సై నరేష్ కుమార్, తదితరులున్నారు.

# ఇచ్చిన మాటకు కట్టుబడి ఉంటా..

**● 10 లక్షలతో సిసి రోడ్ నిర్మాణానికి భూమి పూజ ● చందాపురంను దత్తత గ్రామంగా స్వీకరిస్తున్న విజయోత్సవ సభలో ఎమ్మెల్యే మేఘారెడ్డి**



సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే మేఘారెడ్డి

**వనపర్తి ప్రతినిధి, జనవరి 9, ప్రభాతవార్త:** ఎన్నికల ప్రచారంలో తానిచ్చిన హామీలకు కట్టుబడి ఉంటానని తనకు మంచి మెజారిటీ ఇచ్చి నన్ను ఎమ్మెల్యేగా గెలిపించేందుకు కృషి చేసిన చందాపురం గ్రామస్తులందరికీ పేరు పేరునా కృతజ్ఞతలు తెలియజేస్తున్నానని ఎమ్మెల్యే తూడి మేఘా రెడ్డి పేర్కొన్నారు. ఎమ్మెల్యేగా ప్రమాణ స్వీకారం చేసిన తర్వాత మొట్టమొదటి సారిగా చందాపురం గ్రామానికి వెళ్లిన ఆయన గ్రామంలోని పాఠశాల నుంచి గాంధీ నగర్ వరకు రూ 10 లక్షలతో సిసి రోడ్ నిర్మాణానికి ఆయన భూమి పూజ చేశారు. ముందుగా గ్రామస్తులు డప్పు వాయిద్యాల మధ్యను ఎమ్మెల్యేను ఊరేగిస్తూ సభ స్థలానికి చేరుకున్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ తాను ఎన్నికల ప్రచార కార్యక్రమంలో గ్రామానికి వచ్చిన నాడు ఇచ్చిన హామీలన్నింటిని నెరవేరుస్తానని తప్పకుండా చందాపురం గ్రామంను దత్తత తీసుకుంటానని ఆయన పేర్కొనాననరు. గత ప్రభుత్వం గ్రామాల్లో పూర్త స్థాయిలో అభివృద్ధి జరిగితే నేడు చెందాపూర్ గ్రామంలో అభయహస్తం దరఖాస్తుల స్వీకరణ కార్యక్రమంలో 741 దరఖాస్తులు ఎందుకు వచ్చాయని ఆయన ప్రశ్నించారు. ఈ విషయం గ్రామస్తులందరూ ఆలోచన చేయాలని కేవలం మాటలు చెప్పడమే తప్ప అభివృద్ధి పనులు చేయలేదని ఆయన విమర్శించారు. రానున్న స్థానిక సంస్థల ఎన్నికల్లో సైతం మూకుమ్మడిగా కాంగ్రెస్ పార్టీ తరపున నిలబడిన వ్యక్తులను గెలిపిస్తే అభివృద్ధికి ఎలాంటి ఆటం కాలు ఉండవని ఆయన అన్నారు. కెనాల్ తవ్విరైతులకు సాగునీరు అందిస్తామని చెప్పిన నాయకు డు పెద్ద పెద్ద బావులు తవ్వుకొని ఆ బావి నుంచి ఫామ్ హౌస్ సాగనీటిని తరలించారని పేర్కొన్నారు. గ్రామానికి సాగునీరు అందించే కెనాల్ ను పరిశీలించి వస్తున్నానని గ్రామానికి చెందిన గోల్లోని కుంట, వేదాంతచారి కుంటలకు సాగునీటికి మళ్ళీస్తే అక్కడినుంచి గ్రామానికి చెందిన 250 ఎకరాలకు సాగునీరు అందుతుందని అందుకు సంబంధించి అధికారులను ఆదేశించానని వారం రోజుల్లో సర్వే నిర్వహించి పనులు ప్రారంభిస్తారని ఆయన అన్నారు. నేడు ఇందిరమ్మ ప్రభుత్వంలో ప్రవేశపెట్టిన 6 గ్యారం టీలలో రెండు గ్యారెంటీలను ఇప్పటికే అమలు చేసిందని మిగిలిన గ్యారెంటీల కోసం గ్రామ రోజుల్లో ప్రతి ఒక్కరికి ప్రభుత్వ లబ్ది అంది స్తోందని ఆయన పేర్కొన్నారు. ఈ కార్యక్రమం లో వనపర్తి ఎంపీపీ కిచ్చా రెడ్డి, మాజీ జెడ్పిటిసి వెంకటయ్య యాదవ్, సర్పంచ్ చెన్నరెడ్డి, ఉప సర్పంచ్ శేఖర్, కాంగ్రెస్ గ్రామ కమిటీ అధ్యక్షులు రాజు, యువత అధ్య క్షులు గోపాల్, మోడో సుదర్శన్, పంచాయతీ సెక్రెటరీ రాజశేఖర్, నాయ కులు

# సఫాయి కార్మికుల కుటుంబాల అభివృద్ధికి కృషి చేయాలి

**- అసమానతలు లేకుండా ఆర్థికంగా అభివృద్ధి చెందేలా చూడాలి**

**- జాతీయ కమిషన్ సఫాయి కర్మచారి సభ్యులు డాక్టర్ పి.పి.వావా**




మాట్లాడుతున్న జాతీయ కమిషన్ సఫాయి కర్మచారి సభ్యులు డాక్టర్ పి.పి.వావా

**నాగర్‌కర్నూల్ ప్రతినిధి, జనవరి 09 ప్రభాతవార్త:** నాగర్‌కర్నూల్ జిల్లాలో సఫాయి కర్మచారీలకు అమలు చేస్తున్న కార్యక్రమాలపై సఫాయి కర్మచారి జాతీయ కమిషన్ సభ్యులు డాక్టర్ పి.పి.వావా సంతృప్తి వ్యక్తం చేశారు. స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ కుమార్ దీపక్‌తో కలిసి మంగళవారం నాగర్‌కర్నూల్‌లో బాబు జగ్జీవన్‌రామ్ భవన్‌లో అధికారులు, సఫాయి కర్మచారీలు, ప్రతినిధులతో జాతీయ కమిషన్ సభ్యులు సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా పి.పి వావా మాట్లాడుతూ సమాజం ఆరోగ్యంగా ఉండాలని కష్టపడే సఫాయి కర్మచారీలకు ప్రభుత్వ పథకాల ద్వారా ఆర్థిక సహాయం, బ్యాంక్ రుణాలు అందించాలని సూచించారు. ప్రతి మూడు నెలలకొకసారి వైద్య శిబిరాన్ని నిర్వహించి వారికి వైద్య సేవలందించాలన్నారు. పరిసరాలను శుభ్రపరిచే కార్మికులపై ప్రత్యేక చర్యలు తీసుకోవాలన్నారు. వారికి అందించే జీతాలు తక్కువగా ఉన్నాయని, జీతం పెంచడానికి చర్యలు తీసుకోవాలన్నారు. ప్రతి ఒక్కరికి కనీస వేతనాలు దక్కేలా చట్టాలను కచ్చితంగా అమలు చేయాలన్నారు. సఫాయి కార్మికులకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వం అందించే సంక్షేమ పథకాలు సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు. సఫాయి కర్మచారీస్ కోసం కేంద్ర ప్రభుత్వం ఎలాంటి సెక్యూరిటీ లేకుండా బ్యాంకుల ద్వారా నేరుగా రూ.15 నుంచి రూ.40లక్షల వరకు రుణ సదుపాయం అందిస్తుందని, మెరుగైన జీవనోపాధి శిక్షణ తరగతుల కోసం నెలకు రూ.1500లు 8 మాసాల పాటు అందిస్తుందన్నారు. పలువురు సఫాయి కార్మికులు తమ సమస్యలను జాతీయ కమిషన్ దృష్టికి తీసుకొచ్చారు. కార్యక్రమంలో అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

# సమస్యల పరిష్కారానికే ప్రజాదర్బార్

**● ప్రజా దర్బార్‌కు భారీ ప్రజాస్పందన ● సీఎం దృష్టికి రాజాపూర్, బాలానగర్ పై ఓవర్ సమస్య ● జడ్చర్ల ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో ఫిర్యాదులు స్వీకరించిన ఎమ్మెల్యే అనిరుధ్‌రెడ్డి**



ఫిర్యాదులు స్వీకరిస్తున్న ఎమ్మెల్యే అనిరుధ్‌రెడ్డి

**మహబూబ్‌నగర్ బ్యూరో, జనవరి 09 ప్రభాతవార్త:** సమస్యలు పరిష్కరించేందుకే ప్రజా దర్బార్ కార్యక్రమాన్ని నిర్వహించినట్లు జడ్చర్ల ఎమ్మెల్యే అనిరుధ్‌రెడ్డి స్పష్టం చేశారు. తెలంగాణ రాష్ట్ర కాంగ్రెస్ ప్రభుత్వంలో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న ప్రజా దర్బార్ కార్యక్రమంలో భాగంగా జడ్చర్ల కేంద్రంలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో ఎమ్మెల్యే జనుంపల్లి అనిరధ్‌రెడ్డి దరఖస్తులు స్వీకరించారు. ఈ సందర్భంగా నియోజకవర్గంలోని వివిధ గ్రామాలనుంచి భారీ సంఖ్యలో ప్రజలు హాజరై తమ ఫిర్యాదులను ఎమ్మెల్యేకు వివరించారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ ప్రజా దర్బార్ కార్యక్రమానికి ప్రజల నుంచి మంచి స్పందన వచ్చిందన్నారు. ప్రజలు మాకు ఇచ్చిన ఫిర్యాదులన్ని అధికారుల దృష్టికి తీసుకెళ్లి పరిష్కరిస్తామన్నారు. అదే విధంగా ప్రభుత్వ ఆసుపత్రిలో వైద్య సిబ్బంది కొరత ఉందని మంత్రి దామోదర రాజనర్సింహను అడగడం జరిగిందని, మంత్రి స్పందించి సమస్యను తొందరలోనే పరిష్కరిస్తామని తెలియజేశారని అన్నారు. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డిని బాలానగర్, రాజాపూర్ పై ఓవర్‌ల గురించి అడగడం జరిగిందన్నారు. కేంద్ర ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి పై ఓవర్‌లు మంజూరయ్యే విధంగా కృషి చేస్తానన్నారని తెలిపారు. అలాగే ప్రతి ఎమ్మెల్యేకు నియోజకవర్గ అభివృద్ధి కోసం పదికోట్ల రూపాయలు మంజూరు చేస్తానని ముఖ్యమంత్రి హామీ ఇచ్చినట్లు వెల్లడించారు. నియోజకవర్గంలో ఉన్న గ్రామాలలో ఏఏ ఇబ్బందులు ఉన్నాయో కార్యకర్తలను, నాయకులను అడిగి తెలుసుకుని సమస్యలున్న దగ్గర ఆ డబ్బుతో అభివృద్ధి కార్యక్రమాలు చేపడతానని తెలిపారు. కార్యక్రమంలో మున్సిపల్‌కమిషనర్ షేక్ అహ్మద్ అధికారులు, నాయకులు పాల్గొన్నారు.

## అమరచింతలో వెలసిన అక్రమ వెంచర్లపై విచారణ జరపాలి



అమరచింత మున్సిపల్ కమిషనర్‌కు వినతి పత్రం అందజేస్తున్న కాంగ్రెస్ పార్టీ పట్టణ అధ్యక్షులు అరుణ్ కుమార్

**అమరచింత, జనవరి9, ప్రభాతవార్త :** అమరచింత మున్సిపల్ కేంద్రంలో అక్రమంగా వెలసిన వెంచర్ల పై సమగ్ర విచారణ జరపాలని డిమాండ్ చేస్తూ మంగళవారం కాంగ్రెస్ పార్టీ పట్టణ అధ్యక్షులు, ఎస్ఎం అరుణ్ కుమార్ అమరచింత మున్సిపల్ కమిషనర్‌కు వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా కాంగ్రెస్ పార్టీ పట్టణ అధ్యక్షులు, ఎస్ ఎం అరుణ్ కుమార్ మాట్లాడుతూ, అమరచింత పట్టణంలో డిటిసిపి అనుమతిలేని సర్వేనెంబర్ 10 బై 234,35 వ్యవసాయ భూమిలో ఎలాంటి అనుమతులు లేకుండానే ప్లాట్ల విక్రయిదారులకు ఆత్మకూరు రిజిస్ట్రేషన్ కార్యాలయం అధికారులు అక్రమంగా రిజిస్ట్రేషన్లు చేస్తున్నారని తక్షణమే రిజిస్ట్రేషన్ కార్యాలయం అధికారులపై చర్యలు తీసుకోవాలని ఆయన డిమాండ్ అలాగే అమరచింత మున్సిపల్‌టి 2019లో నూతనంగా ఏర్పడితే జిపి అనుమతితో 01/01/24 నాడు జిపి అను మతితో 40ప్లాట్లు రిజిస్ట్రేషన్లు ఎలాచేశారని ఆయన ప్రశ్నించారు. ఇప్పటికైనా అధికారులు అక్రమంగా రిజిస్ట్రేషన్లు చేసినా వాటిని రద్దు చేయాలని ఆయన డిమాండ్ చేశారు. అక్రమ వెంచర్ల పై మున్సిపల్ అధికారులు తక్షణమే పర్యవేక్షణ చేసిపై అధికారులకు నివేదిక ఇవ్వాలని ఆయన డిమాండ్ చేశారు.

## నూతన క్యాలెండర్ ఆవిష్కరణ



పిఆర్‌టియు టిఎస్ నూతన క్యాలెండర్ ఆవిష్కరిస్తున్న దృశ్యం

**లింగాల, జనవరి 09 ప్రభాతవార్త:** లింగాల మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో మంగళవారం పిఆర్‌టియు టిఎస్ 2024 నూతన సంవత్సర క్యాలెండర్‌ను మండల విద్యాశాఖ అధికారి చంద్రుడు, రాష్ట్ర బాధ్యులు పురుషోత్తం, తాహెర్‌పాషా, అంజిలాల్, మండలాధ్యక్షులు కటకం వెంకటరాజు, ప్రధాన కార్యదర్శి గోపాల్ ఆధ్వర్యంలో ఆవిష్కరించారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు శేఖర్, పిఆర్‌టియు టిఎస్‌సభ్యులు హెచ్ఎంపర్వతాలు, శంకరయ్య, నవీన్‌రావు, సునితమ్మ, స్వరూప, జంగయ్య, రాందాస్, శివ, పర్వతాలు, అశ్రఫ్, అరవింద్, విష్ణు, సుందరయ్య, చాంప్లి, పరశురామ్, రవికుమార్, అహ్మద్, అబ్దుల్లా, ఫర్హానా, శ్రీను, ఎమ్మార్సీ కంప్యూటర్‌ఆపరేటర్ శ్రీనివాసులు పాల్గొన్నారు.

## జిల్లా డీసీసీ వైస్ ప్రెసిడెంట్‌గా జూపల్లి వెంకటయ్య నియామకం



వెంకటయ్యయాదవ్‌ను సన్మానిస్తున్న ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి

**కల్వకుర్తి, జనవరి 09 ప్రభాతవార్త:** నాగర్‌కర్నూల్ జిల్లా డీసీసీ వైస్ ప్రెసిడెంట్‌గా చారకొండ మండలం జూపల్లి గ్రామానికి చెందిన వెంకటయ్యయాదవ్‌ను నియమిస్తూ అచ్చంపేట ఎమ్మెల్యే, డీసీసీ జిల్లా అధ్యక్షులు చిక్కుడు వంశీకృష్ణ నియామక పత్రం అందించారు. ఈ సందర్భంగా వెంకటయ్య మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీ అభివృద్ధి కోసం పని చేస్తానన్నారు. డీసీసీ వైస్ ప్రెసిడెంట్‌గా ఎన్నికైన వెంకటయ్యయాదవ్‌ను కల్వకుర్తి ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి శాలువాతో సన్మానించి అభినందించారు. తన నియామకానికి సహకరించిన డీసీసీ జిల్లా అధ్యక్షులు చిక్కుడు వంశీకృష్ణ, సీడబ్ల్యూసీ ప్రత్యేక ఆహ్వానితులు, మాజీ ఎమ్మెల్యే చల్లా వంశీచంద్‌రెడ్డి, టీపీసీసీ అధికార ప్రతినిధి, జెడ్పీవైస్ చైర్మన్ బాలాజీసింగ్‌లకు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు.

## జిల్లా కలెక్టర్‌ను కలిసిన జడ్పిటిసి



**ఇటిక్యాల జనవరి9 ప్రభాతవార్త:** గద్వాల్ జిల్లా నూతన కలెక్టర్ బి.యం.సంతోష్‌ను మంగళవారం కలెక్టర్ కార్యాలయంలో మర్యాద పూర్వకంగా వడ్డేపల్లి జెడ్పిటిసి రాజు కలిశారు. ఈ సందర్భంగా వడ్డేపల్లి మండలం అభివృద్ధి కొరకు తమవంతుగా కృషి చేయాలని కలెక్టర్ ను కోరారు. ఈ కార్యక్రమంలో శేఖర్, ప్రకాశ్, లక్ష్మణ్, రవిగౌడ్, నరేష్, ప్రసంగి, తదితరులు ఉన్నారు.

## ఎవరి మీద ఫిర్యాదు చేయాలి ఎమ్మెల్యే?

**● బిఆర్ఎస్ జిల్లా అధికార ప్రతినిధి, మున్సిపల్ వైస్ చైర్మన్ వాకిటి శ్రీధర్**

**వనపర్తి ప్రతినిధి, జనవరి 9, ప్రభాతవార్త:** నాలుగు రోజుల క్రితం మానాజీపేట సర్పంచ్, కాంగ్రెస్ నేత అక్రమంగా జేసీబీ, వాహనాలు పెట్టి ఇసుక తరలిస్తుంటే పోలీసులు పోలీస్ స్టేషన్‌కు తరలిస్తే దాని మీద విచారణ చేయాలని చెప్పకుండా స్వయంగా ఎమ్మెల్యే పోలీస్ స్టేషన్ కు వెళ్లి వాహనాలను విడిపించుకుని వస్తే ఎవరికి ఫిర్యాదు చేయాలి ? ఎవరు గోప్యంగా ఉంచుతారు? అని బిఆర్ఎస్ జిల్లా అధికార ప్రతినిధి, మున్సిపల్ వైస్ చైర్మన్ వాకిటి శ్రీధర్ మంగళవారం ఒక ప్రకటన ద్వారా ఎమ్మెల్యే మేఘారెడ్డిని ప్రశ్నించారు. మిల్లులో అక్రమాలు జరి గితే ప్రభుత్వంలోని సంబంధితశాఖ అధికారులకు ఫిర్యాదు చేసి విచా రణ జరిపి చర్యలు తీసుకోమని కోరాలి. స్వయంగా ఎమ్మెల్యే రైసు మిల్లుల యాజమాన్యాలకు ఫోన్లు చేసింది నిజం కాదా ?. సివిల్ సప్లై బియ్యం విషయంలో ఎమ్మెల్యేవత్తిళ్లకు తలొగ్గి అక్రమ కేసులు చేయలేక జిల్లా స్థాయి అధికార సెలవులో వెళ్లింది నిజం కాదా ? చట్టాన్ని చేతిలోకి తీసుకుని చుట్టంలా వాడుకుంటూ ఏమైనా ఫిర్యాదులు ఉంటే చేయ మనడం ఎవరిని ఏమార్చడానికి? ముందు మీపేరు వాడుకుని వసూళ్లు చేస్తున్నట్లు మీదృష్టికి వచ్చిన వారి పేర్లు బయటపెట్టి చట్టరీత్యా స్టేషన్‌లో ఫిర్యాదు చేసి వారి మీద చర్యలు తీసుకుంటే అప్పుడు ప్రజలు మీ ప్రకటనను విశ్వసించే అవకాశం ఉంటుందని ఆయన ప్రకటన ద్వారా సూచించారు.

## మాజీ ఎమ్మెల్యేను కలిసిన కాంగ్రెస్ నాయకులు

**ఇటిక్యాల జనవరి9, ప్రభాతవార్త:** ఏఐసీసీ కార్యదర్శి అలంపూర్ మాజీ ఎమ్మెల్యే సంపత్‌కుమార్‌ను హైదరాబాదులోని ఆయన స్వగృహంలో కాంగ్రెస్ నాయకులు జెడ్పి చైర్మన్ సరిత తిరుపతయ్య , ఎంపిటిసి నీలి లక్ష్మి శ్రీనివాసులు, సర్పంచు మధు నాయుడు, తదితరులు మర్యాద పూర్వకంగా కలిసి అలంపూర్ నియోజకవర్గ అభివృద్ధి పై చర్చించారు. అదే విధంగా మాజీ ఎమ్మెల్యే సంపత్‌కుమార్ తనయుడు దీపక్ ప్రజ్ఞ పుట్టినరోజు సందర్భంగా శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఇస్మాయిల్, సతీష్‌రెడ్డి, బలరాముడు, తదితరులు ఉన్నారు.



హైదరాబాదులో మాజీ ఎమ్మెల్యే సంపత్‌కుమార్‌ను కలిసిన కాంగ్రెస్ నాయకులు

